"హమ్మయ్య... పొద్దునే నాకు మొహం కడుక్కుంటే కానీ ఫ్రెష్‌నెస్ రాదండీ" అంటూ సదానందం ప్రక్కన్న కూర్చున్న వాలేస్వర్రావ్ అలియాస్ వాలి ఓ క్షణం ఆగి "ఔనూ... ట్రైన్ ఇక్కడ ఆగిందేమిటి? ఇది స్టేషన్‌లాగా కూడా లేదే. వేరే ఏదైనా ట్రైన్ రాకపోకల కోసంగానీ ఆపేసుంటాడంటారా?" అడిగాడు కిటికీలోంచి అటూ ఇటూ చూస్తూ.

ఆ మాటలకి సదానందం 'అమ్మో మళ్లీ వీడు నాతో మాట కలిపి నన్ను మొహమాటం పెట్టి వాడి పబ్బం గడిపేసుకుంటాడు' అని మనసులో అనుకుని 'ఔను, కాదు' అనే సమాధానం కూడా చెప్పకుండా ముఖం చిరాగ్గా అటువైపుగా తిప్పి వీక్లీ చదవడం ఆరంభించాడు.

# వాలేశ్వర్రావ్

-వడ్లమన్నాటి గంగాధర్



అతడ్ని గమనించిన వాలి "అరే... కొత్త వీక్లీలా ఉంది. ఇప్పుడే కొన్నారా? మంచి పని చేసారు. కాలక్షేపానికి బావుంటుంది. మీరు చదివాక ఓసారి ఇవ్వండి. కథలు మాత్రం చదివి మీకు ఇచ్చేస్తాను" అంటూ పళ్లికిలించాడు.

ఆ మాటలకు సదానందం వీక్లీని ఓ ప్రక్కగా దాచేస్తూ "ఇవ్వను... ఇవ్వనుగాక ఇవ్వను. ఇప్పటివరకూ మీరు నామీద వాలింది చాలు. నిన్న కూడా అచ్చం ఇలాగే నేను కొనుక్కున్న బిస్కెట్ ప్యాకెట్ చూసి ఈ బిస్కెట్ అంటే నాకు చాలా ఇష్టం అంటూ నా సగం బిస్కెట్లు తినేసావ్. పోనీలే కుర్రాడు ఆకలిమీద ఉన్నాడ్లే అనుకున్నాను. ఆ తరువాత నా సెల్‌ఫోన్ మోడల్ చాలా బాగుంది అంటూ నన్ను తెగ పొగిడేసి తరువాత ఓ ఫోన్‌కాల్ మాత్రమే చేసుకుంటానని చెప్పి నా పదకొండు రూపాయల బ్యాలెన్స్ ఆవజేసేసావ్. పోనీలే ఏదో ఇంపార్టెంట్ కాల్ అయి వుంటుందని సరిపెట్టుకున్నాను. ఆ తరువాత కాసేపటికి నేనూ ఈ బ్రాండ్ సిగరెట్లే తాగుతానే అంటూ నాదో సిగరెట్టు కాల్చేసావ్. చిల్లర లేదని చెప్పి నా ఖాతాలో ఓ కాఫీ తాగేసావ్. ఇప్పుడు మళ్లీ ఇదొకటా? వద్దు మహాప్రభో వద్దు... నువ్వు నన్ను పొగడావద్దు, నన్నిలా నిలువుదోపిడీ చేయావద్దు. అసలు మీ పేరు వాలేస్వ్రావ్ అన్నప్పుడే గ్రహించాల్సింది మీరు పరులమీద అవలీలగా వాలిపోయేవారని" అని చెప్పి మళ్లీ వీక్లీలోకి తల దూర్చాడు సదానందం.

"వీక్లీ ఇవ్వనని ఓ మాటలో చెప్పొచ్చుగా సార్. ఇంత రామాయణం అవసరమంటారా చెప్పండి" అని వాలి అంటుండగానే ఎదురు సీట్లోకి ఓ ముసలాయన వచ్చి కూర్చున్నాడు. అతన్ని చూసిన వాలి ఓ చిరునవ్వు నవ్వి "టైమ్ ఎంతయింది బ్రదర్" అన్నాడు మర్యాదగా.

"బ్రదరా? నేను బ్రదరేమిటిరా భడవా? నీ కంటికి శుక్లమా లేక నీ చూపే వక్రమా? నాకు అరవై సంవత్సరాల దగ్గర వయస్సు. అర్థమయిందా?" అంటూ గయ్యిమన్నాడు.

"సారీ సార్. మీ ముఖంలో ముడతలుకానీ, ముసలితనపు లక్షణాలు కానీ ఏ కోసానా కనిపించకపోవడంతో పొరపాట్న మీరు నా వయస్సువారే గానీ, నాకన్నా చిన్నవారనుకున్నాను. అందుకే బ్రదర్ అని అనేసాను" చెప్పాడు వాలి వినయపూర్వకంగా.

అతని మాటలు విన్న సదానందం ఆ ముసలాయన వైపు జాలిగా చూస్తూ 'ప్చ్... వీడి ఖాతాలో మరో బకరా బలి' అని మనసులో అనుకుని మళ్లీ వీక్లీలో మునిగాడు.

"ఆ.. మరేం పర్లేదు నాయనా... నేను నీ కంటికి కుర్రాడిలా కనిపించాను అని వినడం నాకు ఆనందంగానే అన్పిస్తోంది. అవును బాబూ మీరు ఏ ఊరు వెళ్లాలి?"

"రాజమండ్రి. మరి మీరు?"

"విజయవాడ నాయనా"

"అలాగా... మా అమ్మమ్మవాళ్లది కూడా విజయవాడే" చెప్పాడు వాలి కాస్త ఉత్సాహంగా.

ఆ మాటలకి సదానందం వీక్లీలోంచి బయటపెట్టి "నీకు ఎందరు అమ్మమ్మలు నాయనా?" అడిగాడు వెటకారంగా.

"ఒక్కరే" చెప్పాడు వాలి.

"మరి నిన్న నాతో మీ అమ్మమ్మగారిది మా ఊరే, తుని అన్నట్లుగా, అది నేను విన్నట్లుగా గుర్తు"

"అవునూ... అది మా వేలు విడిచిన అమ్మమ్మది. సొంత అమ్మమ్మది కాదు" అని వాలి కొంచెం అసహనంతో చెప్పాడు.

ఏం అర్థంకాని సదానందం "అలాగా... మంచిది. మాట్లాడుకోండి" అన్నాడు.


"అలాగా?" ఆశ్చర్యపోయాడా ముసలాయన.

"అవునండీ నా బాల్యం అంతా విజయవాడలోనే గడిచింది. చిన్నప్పుడు కాగితం పడవలు చేసి కృష్ణానదిలో వదిలేవాడ్ని. అలాగే నేను సైకిల్ కూడా కృష్ణా బ్యారేజీ మీదే నేర్చుకున్నాను. నా ప్రతి వేసవి సెలవుల్లోనూ విజయవాడ వస్తుండేవాడ్ని" అని అతను చెప్పుండగానే 'ఇడ్లీ, వడ, పూరీ' అంటూ టిఫిన్స్ అమ్ముకునేవాడు రాగానే విజయవాడలో తన బాల్యం

## మేథోశక్తిని పెంచే బాక్టీరియా

బాక్టీరియా రెండురకాలు. హానికరమైనవి, లాభదాయకమైనవి. మొక్కలు, జంతువుల్లో వ్యాధులు కలిగించే బాక్టీరియాను, వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర విధాలుగా ఉపయోగపడే బాక్టీరియాను ఇందుకు ఉదహరించవచ్చు. బాక్టీరియావల్ల సంతరించగల మరోలాభం గురించి ఈమధ్యే తెలియవచ్చింది. న్యూయార్క్‌లోని సేజ్ కాలేజీ ఆచార్యులు ఎలుకలపై జరిపిన పరిశోధనలో ఈవిషయం రుజువైంది. రెండు ఎలుకల బృందాలపై వీరు జరిపిన అధ్యయనంలో నేలలో కనిపించే హాని కలిగించని మైకో బాక్టీరియం వాక్కే పూసిన పీనట్ బట్టర్ ఒక బృందానికి, సాధారణ పీనట్‌బట్టర్ మరో బృందానికి ఇచ్చారు. ఆ తరువాత ఈ రెండు బృందాల్లోని ఎలుకలను మహా చిక్కైన దారిలో వదిలారు. ఈ చిక్కైన దారిలో బాక్టీరియం పూసిన పీనట్ బట్టర్ తిన్న ఎలుకలు, సాధారణ పీనట్ బట్టర్ తిన్న ఎలుకలకన్నా రెండు అధిక వేగంతో పరుగెత్తడం గమనించబడింది. మైకో బాక్టీరియం వాక్కే ఎలుకల మేథోశక్తిని పెంచేందుకు తోడ్పడిందని, ఫలితంగానే చిక్కైన దారిలో త్వరగా ఎలా ముందుకెళ్లాలో అవి నేర్చుకున్నాయని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. బాక్టీరియాను తినడంవల్ల మేథోశక్తి పెరుగుతుందని ప్రతిపాదిస్తున్నారు. అవి ఒకేసారి మాత్రమే ఇలా పరుగెత్తలేదని, ఆరువారాలపాటు, 18సార్లు ఇలాగే పరుగెత్తాయని తెలుస్తోంది. నాలుగువారాలదాకా ఈ ప్రభావం కొనసాగడం గమనార్హం. ఎలుకల రోగ నిరోధక వ్యవస్థపై బాక్టీరియం చూపిన ప్రభావంవల్లే ఇలా జరిగిందని శాస్త్రజ్ఞులు తెలిపారు. బాక్టీరియా 'నేర్చుకోవడాన్ని' వేగవంతం చేస్తాయని భావిస్తున్నారు.

-డా.నమ్మోట



గురించి చెప్తున్నవాడల్లా ఇటు తిరిగి "బాబూ! నాకు ఓ ప్లేటు వడ, ఓ ప్లేటు పూరీ ఇవ్వు'' అని చెప్పి వాడి చేతిలో ఏటిఎమ్ కార్డుపెట్టి వాడి ఎడం చేతిలో వున్న టిఫిన్ పొట్లాలు అందుకున్నాడు.

"ఇదేంటి సారూ... డబ్బుకి బదులుగా ఈ కార్డు ముక్క ఇచ్చారు? ఇది నేనేం చేసుకోవాల?'' అడిగాతను తలపై గోక్కుంటూ.

"ఓ ఐయామ్ సారీ. నేను ఎప్పుడూ క్రెడిట్ కార్డ్ వాడుతుంటాను. అల వాటులో పొరపాటు. సరే ఓ పని చేయి. నెక్ట్స్ స్టేషన్ రాగానే గుర్తు చేయి. ఏటిఎమ్‌కి వెళ్లి డబ్బు తెచ్చిస్తాను'' చెప్పాడు మళ్లీ ఆ కార్డు తీసుకుని జేబులో పెట్టుకుంటూ.

"ఇదిగో సారూ... నాకవన్నీ తెలియవు. నా డబ్బులు నాకిచ్చేయండి చాలు. లేకపోతే మా తమ్ముడ్ని పిలుస్తాను'' అన్నాడతను కొంచెం కోపంగా.

"ఏం మీ తమ్ముడితో కొట్టిస్తావా?'' అడిగాడు వాలి కాస్తంత చిరుభయంతో. వారి వాదన చూస్తున్న ముసలతను-

"ఎందుకులే బాబూ అతనితో వాదన? డబ్బు నేనిస్తాలే'' అంటూ డబ్బులు లెక్కపెట్టి అతనికి ఇచ్చి పంపేసాడు.

"చాలా థాంక్స్ సార్. పక్క స్టేషన్ రాగానే కాస్త మరచిపోకుండా గుర్తు చేయండి. మీ డబ్బులు ఇచ్చేస్తాను'' చెప్పాడు వాలి చాలా నిక్కచ్చి స్వరంతో.

అతని మాటలకి ఆ ముసలతను చిన్నగా నవ్వుతూ "అలాగా! అయితే ఇదిగోండి మాటల్లోనే మన ఊరు విజయవాడ వచ్చేసింది పదండి'' అంటూ బ్యాగ్ పట్టుకుని పైకి లేచాడు.

ఏం అర్థంకాని వాలి మనసులో 'కొంపదీసి తన డబ్బులు తనకిమ్మని అడుగుతాడా ఖర్మ? ఒట్టి పిసినారిలా ఉన్నాడే' అనుకుని ఆ ముసలతన్నే వెంబడించి ట్రైన్ దిగాడు వాలి.

"వస్తాను'' అని చెప్పి వెళ్లబోయిన ఆ ముసలాయన ఓ క్షణం ఆగి "బాబూ! మీరు ఏం అనుకోకపోతే మీకు డబ్బులేమైనా కావాలంటే అడగండి ఇస్తాను'' చెప్పాడతను వాలి భుజంపై చేయి వేస్తూ.

"డబ్బా... ఎందుకు సార్. అయినా నేను కదా మీకు డబ్బులు ఇవ్వాల్సింది?''

"ఏం లేదు నాయనా... ఇందాక మీ గురించి ఆ వ్యక్తి అలా మాట్లాడేసరికి నాకు సందేహం వచ్చింది. అదేమిటంటే మీ దగ్గర డబ్బులు లేక అలా మాలాంటివారి మీద వాలిపోయారా లేక అది మీ సహజ అలవాటా అని? ఒకవేళ డబ్బే లేక అయితే అది నేనే ఇద్దామని... అంతే'' అన్నాడాయన చిరు మందహాసంతో.

"ఒకవేళ అది నా సహజ అలవాటే అయితే'' ప్రశ్నించాడు వాలి.

"ఏముందీ... మన అవసరం ఏదైనా అది పరుల్ని ఇబ్బంది పెట్టేదై ఉండకూడదు. కవి భర్తృహరి మాటల్లో చెప్పాలంటే ఒకరికి ఉపకారం చేస్తే పుణ్యం, పీడిస్తే పాపం అని. కనుక స్వశక్తిని నమ్ముకో నాయనా. మొదట్లో కాస్త ఇబ్బందే అనిపించినా ఆ తరువాత అది నీకు కొండంత నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇస్తుంది'' అన్నాడాయన.

ఆ మాటలకి వాలి చిన్నగా నవ్వుతూ "మీలాంటి వారిని కలవడం చాలా ఆనందంగా ఉంది. కాకపోతే ఇందాక నేను అన్నట్లు వాలిపోవడం అనేది నా అలవాటూ కాదు, నా స్వభావం అంతకన్నా కాదు. అయితే ఇదే జర్నీలో నిన్న రాత్రి మా మామయ్య తన పర్సు నాకు ఇచ్చి ఉంచమన్నాడు. నేను పొరపాట్న అతని పర్సూ, నా పర్సూ రెండూ పోగొట్టాను. దాంతో ఆయనకి కోపం వచ్చి నాపై అరిచి మిగిలిన జర్నీ అంతా ఒక్క పైసా కూడా తనని అడక్కుండా పూర్తి చేయమని సవాల్ విసిరాడు. దాంతో నాకు కోపం వచ్చి ఆ రిజర్వేషన్ బోగీ నుండి ఈ జనరల్ బోగీకి వచ్చాను. మరి నా దగ్గర పైసా లేక అవసరంకోసం మా మామయ్య సవాల్ గెలవడం కోసం ఇలా వాలేస్వ్రావ్‌గా అవతారమెత్తి ఈ ప్రయాణం పూర్తి చేసాను. అంతే. మీవీ, నా పక్కాయనవీ కూడా డబ్బు పంపేస్తాను. అడ్రసివ్వండి'' అన్నాడు.

ముసలాయన చిరునవ్వుతో చిరునామా చెప్పి వెళ్లిపోయాడు.

★



## ఎదురు చూస్తున్నాను!

ఆర్య-2లో 'మిస్టర్ ఫర్‌ఫెక్ట్..ఫర్‌ఫెక్ట్...' అంటూ హుషారుగా నటించిన శ్రద్ధాదాస్ తెలుగులో తన ప్రతిభకు గుర్తింపు రాలేదనుకుందో ఏమో తన దృష్టిని హిందీ చిత్రాలవైపు మళ్లించి 'లాహోర్' అనే చిత్రంలో నటించింది. ఈ విషయమై మాట్లాడుతూ 'నేను హిందీ చిత్రాల్లో నటిస్తూనే తెలుగులో కూడా నటిస్తాను. ఎందుకంటే నాకు నటిగా గుర్తింపునిచ్చింది తెలుగు చిత్రాలే. భవిష్యత్తులో తెలుగు, హిందీ చిత్రాలకు దర్శకత్వం వహించాలని వుంది. ఆ అవకాశం త్వరగా రావాలని కోరుకుంటున్నాను' అంటూ తన మనసులోని మాట చెప్పింది శ్రద్ధాదాస్. బెస్టాఫ్ లక్ శ్రద్ధా!

